క్లుప్తంగా

విద్యతో పాటు క్రీడా సామర్థ్యాలు కనబరచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

పెద్దాపురం: ప్రతి విద్యార్థి క్రీడలు, విద్యల్లో శక్తి సామర్థ్యాలను కనపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెద్దాపురం గురుకుల పాఠశాల కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ సీకేపీ అన్నారు. స్థానిక సుధా కాలనీ గురుకుల పాఠశాల విద్యార్థులచే గురువారం ఎనర్జీ ఎఫిషియెన్సీ, ఎనర్జీ కన్వర్షన్స్‌పై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనపర్చాలన్నారు. విద్య, క్రీడారంగంలో మరింత ఆసక్తిని కనపర్చుకుని ప్రతిభా పోటీల్లో తలపడాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు



గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పిఠాపురం: మీకు రక్షణగా మేముంటాం, ఎన్నికల్లో మీ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి అంటూ పిఠాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పోలీసులు ప్రచారం చేశారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో గురువారం కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో కేంద్ర సీఐఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు గ్రామాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో లౌడ్ స్పీకర్ల ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు విస్తరించండి

డయల్ యువర్ డీఎంలో ప్రయాణికుల వినతి

కాకినాడ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని, ఆర్టీసీ సేవలను విస్తరించడం ద్వారా ఆయా రూట్లలో బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు. గురువారం కాకినాడ ఆర్టీసీ డిపోలో 'డయల్ యువర్ డిపో మేనేజర్' నిర్వహించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ ఫోన్ ద్వారా ప్రయాణికుల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సామర్లకోట బళ్లమార్కెట్, విఘ్నేశ్వర టాకీస్, మెహర్ కాంప్లెక్స్, బ్రౌన్‌పేట ప్రాంతాల్లో బస్‌స్టాప్‌ల వద్ద సమయ వేళలు ఏర్పాటు చేయాలని, సామర్లకోట-పిఠాపురం బస్సును పెద్దాపురం వరకు పొడిగించాలని కోరారు. తుని-కాకినాడ బస్‌ల సమయవేళలను పునః సమీక్షించాలని దుర్గాడకు చెందిన శివకోటి బాబురావు కోరారు. కాకినాడ-జి.మామిడాడ మధ్య బడిబస్సులను తిప్పాలని ప్రయాణికుడు అహ్మద్ విజ్ఞప్తి చేశారు. పిఠాపురం-ఏలేశ్వరం మధ్య బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికుడు జె.వెంకటేశ్వరరావు కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎం మనోహర్ తెలిపారు.

ఉపకరణాల పంపిణీకి వైద్య పరీక్షలు

బాలాజీచెరువు: సమగ్రశిక్ష, సహిత విద్య విభాగంలో ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ నిమిత్తం గురువారం కాకినాడ భవిత సెంటర్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకూ గల పిల్లలకు నిర్ధారణ నిమిత్తం ఆర్థోపెడిక్, ఆప్తమాలజిస్ట్, ఈఎన్‌టీ, సైకియాట్రిస్ట్ వైద్యులు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కాకినాడతో పాటు కాజులూరు, తాళ్లరేవు, కరప, పెదపూడి, కాకినాడ రూరల్‌కు సంబంధించి పాల్గొన్నారని సహిత విద్య కో-ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు తెలిపారు.

ఎన్నికల విధులపై అవగాహన అవసరం

ఈఆర్వో వెంకటరావు

కాకినాడ: సిటీ నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులకు ఎన్నికల విధులపై గురువారం సాయంత్రం శిక్షణ ఇచ్చారు. సిటీ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడుగురు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగం, పోలింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియపై ఇచ్చిన శిక్షణను సంపూర్ణ అవగాహన చేసుకుని ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సెక్టార్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్వో సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- నియోజకవర్గంలో 1389 మంది బైండోవర్
- 24 ఆయుధాలు స్వాధీనం
- 29 సమస్యాత్మక గ్రామాలు గుర్తింపు
- ట్రైనీ డీఎస్పీ ప్రమోద్



ట్రైనీ డీఎస్పీ ప్రమోద్



గొల్లప్రోలు మండలంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ ప్రమోద్

పిఠాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రతతో పాటు నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలపై గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో కొత్తపల్లి మండలంలో 7, గొల్లప్రోలు మండలం, నగర పంచాయతీలో 4, పిఠాపురం రూరల్‌లో 3, పిఠాపురం పట్టణంలో 10 మొత్తం 24 లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లైసెన్స్ ఉన్న ఆయుధాలు కలిగిన వ్యక్తులు జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా తమ వద్ద ఆయుధాలను ఉంచుకోరాదన్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో 107 సెక్షన్ కింద కొత్తపల్లి మండలంలో 25 కేసుల్లో 160 మంది, గొల్లప్రోలు మండలం, నగర పంచాయతీలో 30 కేసుల్లో 116 మంది, పిఠాపురం రూరల్‌లో 57 కేసుల్లో 340 మంది, పిఠాపురం పట్టణంలో 40 కేసుల్లో 212 మందిని బైండోవర్ చేశామన్నారు. 110-ఈ సెక్షన్ కింద కొత్తపల్లి మండలంలో 15 కేసుల్లో 139 మంది, గొల్లప్రోలు మండలం, నగర పంచాయతీలో 16 కేసుల్లో 187 మంది, పిఠాపురం రూరల్‌లో 19 కేసుల్లో 158 మంది, పిఠాపురం పట్టణంలో 15 కేసుల్లో 92 మందిని బైండోవర్ చేశామన్నారు. 109 సీఆర్‌పీసీ కింద పిఠాపురం మండలంలో ఒక కేసులో ఇద్దరిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో కొత్తపల్లి మండలంలో 13 మంది, గొల్లప్రోలు మండలం, నగర పంచాయతీలో 17 మంది, పిఠాపురం రూరల్‌లో 26 మంది, పిఠాపురం పట్టణంలో 42 మంది వెరసి మొత్తం 98 మంది రౌడీ షీటర్లలో 84 మందిని బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

విస్తృతంగా తనిఖీలు

ప్రస్తుతం 216వ నంబర్ జాతీయ రహదారిపై గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద పోలీసు, రెవెన్యూ, ఎన్నికల ప్రత్యేక అధికారులు నిరంతర వీడియో చిత్రీకరణతో పాటు వాహన తనిఖీలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలంలో దుర్గాడ, చేబ్రోలు, చినజగ్గంపేట, ఏకే మల్లవరం, పిఠాపురం మండలంలో భోగాపురం, జల్లూరు, పి.దొంతమూరు, నవఖండ్రవాడ, కందరాడ, చిత్రాడ, కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, మూలపేట, నాగులాపల్లి, కొండెవరం, ఇసుకపల్లి, శ్రీరాంపురం తదితర 29 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సుమారు 100 మంది సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక పోలీసులతో భద్రత కల్పించనున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ 24 గంటలూ రెండు షిఫ్టులుగా గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక మరో ముగ్గురు స్క్వాడ్‌లు రంగంలోకి దిగి తనిఖీలు చేపడతాయన్నారు. 2004, 2019 సార్వత్రిక ఎన్నికలతో పాటు 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్న 1389 మందిని స్థానిక తహసీల్దార్ కోర్టులో ఒక్కొక్కరి వద్ద రూ.3 లక్షల వరకూ పూచీకత్తులు తీసుకుని బైండోవర్ చేశామని ఆయన తెలిపారు. వీరందరిపైనా పూర్తి నిఘా ఉంటుందని ఎవరు ఎటువంటి హింసాత్మక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు

ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే అధికారులు, పోలీసులు పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. గ్రామాల్లో పల్లె నిద్ర కార్యాక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలను చైతన్య పరచడంతో పాటు వారిలో సంపూర్ణ ధైర్యాన్ని నింపుతున్నామని చెప్పారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అందరూ నడుచుకునేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారాలపైనా దృష్టి పెట్టినట్టు తెలిపారు. అనుమతి లేని ప్రచారాలను నిలిపివేసి అనుమతి తీసుకున్న తరువాతే ప్రచారం చేసకోవాలని సూచిస్తున్నామని చెప్పారు. ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు సహకరించి పిఠాపురం నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని ఆయన కోరారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం తథ్యం

- ఎంపీ అభ్యర్థి సునీల్‌తో గొరకపూడి



చలమలశెట్టి సునీల్‌ను సత్కరిస్తున్న చిన్నయ్యదొర

సామర్లకోట: భారతమాత సేవా పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, జైభారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొరను వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన ఆయనను పార్టీ విజయానికి కాలసిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సునీల్ కోరారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారానికి తాను పాల్గొంటానని గొరకపూడి ఆయనకు తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, పార్లమెంట్ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి ఘన విజయం సాధిస్తారని గొరకపూడి తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్‌ను గొరకపూడి సత్కరించారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా



ఎన్నికల ప్రచారంలో కూరగాయల బండిని తోస్తున్న వంగా గీత



పిఠాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత తదితరులు

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత
- పిఠాపురంలో ఎన్నికల ప్రచారం

పిఠాపురం: మీరు ఓటు వేసి ఆదరించండి.. నేను అభివృద్ధి చేసి చూపిస్తా.. మీకు అండగా ఉంటా అని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత అన్నారు. పిఠాపురం మున్సిపాలిటీలోని 13, 25 వార్డుల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటివరకూ ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఆయా వార్డుల్లో ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా, పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు సాదర స్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో ముచ్చటించారు. మాకు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా చెప్పుకునే అవకాశం మీ దగ్గర మాత్రమే ఉంటుందని, అందుకే మాకు మీరే ఎమ్మెల్యే కావాలని స్థానికులు ముక్త కంఠంతో చెప్పారు. వార్డులో ప్రతి ఇంటికి వెళ్లిన ఆమె ఇప్పటి వరకు తాను పిఠాపురం పట్టణంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రజల ముందుకే పాలనను తీసుకువచ్చి సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇళ్లకే చేర్చుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని వంగా గీత కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముమ్మిడి సుజిత, తలిశెట్టి వెంకటేశ్వరరావు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సమర్థంగా పోలింగ్ బూత్‌ల నిర్వహణ

- కోడ్ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ ఉషారాణి



కట్టమూరులో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ బూత్‌ల నిర్వహణకు అన్ని చర్యలు చేపడుతున్నట్టు, గ్రామాల్లో కోడ్‌ను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించామని, ఎక్కడైనా అటువంటి సమస్యలు ఉంటే అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల పోస్టర్లు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు ఉంటే వెంటనే తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. . స్వీప్ లక్ష్యాన్ని ప్రజలకు వివరించాలని ఆదేశించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఆమె వెంట మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు సుభాని, నక్కా సత్యనారాయణమూర్తి, రాధాకృష్ణ, సచివాయల సిబ్బంది ఉన్నారు.

సంక్షేమంతోనే వైఎస్సార్ సీపీ విజయం



మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న దొరబాబు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి

పెద్దాపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ గెలుపునకు నాంది అని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. గురువారం ఆయన పట్టణంలో 25వ వార్డు కొత్తపేట, నాగంపేట ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేసి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, తాడి రాజశేఖర్, ఆ వార్డు కౌన్సిలర్ బొబ్బిలి వెంకటలక్ష్మి, హరిబాబు, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీల ఆధ్వర్యంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తెరిగి ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలన్నారు. పార్టీ రహితంగా అర్హులందరికీ నవరత్నాలు పథకాల ద్వారా సంక్షేమాన్ని అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుంతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీకి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. స్థానికుడినైన తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని దొరబాబు కోరారు. జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, పట్టణ కన్వీనర్ చింతా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, గడపా శివ, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత



పార్టీలో చేరిన మాజీ కౌన్సిలర్ ధనరాజును అభినందిస్తున్న దొరబాబు

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీ చేరుతున్నారు. ఒక పక్క వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుంటే మరోపక్క పార్టీలో చేరికలు ఊపందుకున్నాయి. పిఠాపురం మండలం వెల్దుర్తికి చెందిన సుమారు 150 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పలువురికి దవులూరి ఆహ్వానం

సామర్లకోట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని పలు సర్వేలు వెల్లడించడంతో అనేక మంది పార్టీలో చేరడానికి ముందుకు వస్తున్నారు. దీనిలో భాగంగా జి.మేడపాడు గ్రామానికి చెందిన జనసేన నాయకులు ఆ పార్టీని వీడి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ జెడ్పీ అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగ నాయకులు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు వారిని పార్టీలోనికి ఆహ్వానించారు. జనసేనకు చెందిన నరవ నాగేశ్వరరావు, ఉగ్గిన సత్తిబాబు, బురిడి అబ్బులు, బుజ్జి తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మేడపాడులో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులతో దవులూరి దొరబాబు, తదితరులు

మాజీ కౌన్సిలర్ ధనరాజ్ చేరిక

కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ పంతాడి ధనరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మర్రి సూర్య నారాయణ వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో దవులూరి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్ కౌన్సిలర్ మర్రి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

బాషాకు సత్కారం

సామర్లకోట: స్థానిక రైల్వే పార్శిల్ కార్యాలయ ఉద్యోగి బాషాను గురువారం పలువురు రైల్వే అధికారులు అభినందించి సత్కరించారు. బుధవారం స్థానిక ప్లాట్‌ఫాంపై ఉన్న వృద్ధుని విషయంలో ఔదార్యం చూపడంపై ఆయనను సత్కరించారు. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ బి.శ్రీధర్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ నారాయణరావు తదితరులు బాషాను అభినందించారు.



బాషాను సత్కరించిన రైల్వే ఉద్యోగులు

ఆధార్ సెంటర్లను తెరిపించండి సారూ !

- సచివాలయాల్లో మూతపడిన ఆధార్ నమోదు కేంద్రాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- తెరిపించాలని మొర

గొల్లప్రోలు: మండలంలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు మూత పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు గ్రామ/వార్డు సచివాలయాలను ప్రవేశపెట్టారు. ఆయా సచివాలయాల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తున్నారు. గ్రామాల్లో పింఛన్లు తీసుకునే వృద్ధులు, వికలాంగులు, వేలిముద్రలు పడని వారు, పిల్లలకు కొత్త ఆధార్ కార్డులు కావాల్సిన తల్లిదండ్రులు దూరప్రాంతాలకు వేళ్లకుండా గ్రామ/వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లను సైతం ఏర్పాటు చేశారు.

నాలుగేళ్ల క్రితం ఏర్పాటు

మండలంలోని చేబ్రోలు సచివాలయం-1లో మొదటి విడతలో భాగంగా 2020 డిసెంబర్‌లో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఫేజ్-2లో భాగంగా తాడిపర్తి, దుర్గాడ, గొల్లప్రోలు సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. ఆయా సెంటర్లలో ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. కాగా కొద్దిరోజులుగా ఆయా సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు మూతపడ్డాయి. 10 సంత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ మార్చి నెల 31 లోగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలనే గడువు ముగుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆధార్ జిల్లా కో ఆర్డినేటర్ జె.శంకర్‌ను వివరణ కోరగా సాంకేతిక కారణాలతో సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు మూతపడ్డాయన్నారు. మరికొన్ని రోజుల్లో సమస్యను పరిష్కరించి ఆధార్ కేంద్రాలను తిరిగి ప్రారంభిస్తామన్నారు.



చేబ్రోలులో గ్రామ సచివాలయం

ఆధార్ సేవలు ఆగిపోవడంతో ఇక్కట్లు



మా అమ్మకు కొత్తగా ఆధార్ నమోదు కోసం ఆరు నెలలుగా ఇబ్బందులు పడుతున్నాం. సచివాలయాలకు వెళితే మెషీన్ పనిచేయడం లేదని చెబుతున్నారు. మా అమ్మ అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉంది. దూర పాంతాలకు తీసుకుని వేళ్ల లేని పరిస్థితి మాది. సచివాలయంలో అన్ని సేవలు అందుతున్నాయి. ఆధార్ సేవలే ఆగిపోయాయి. వాటిని పునరుద్ధరించి మా ఇబ్బందిని తొలగించాలి.

– ముమ్మిడి నాగేశ్వరరావు, చేబ్రోలు

ఆధార్ సేవలు పునరుద్ధరించాలి



నాకు ఆధార్ కార్డు లేదు. కొత్తగా ఆధార్ నమోదు కోసం కూలీ పని మానుకొని దూర ప్రాంతాలకు వెళ్లలేక ఆధార్ నమోదు చేయించుకోలేదు. మా సచివాలయంలో ఆధార్ సెంటర్ ఉందని తెలుసుకొని సచివాలయానికి వెళ్లాను. మెషీన్ పని చేయటం లేదని చెప్పారు. మాకు దగ్గరలోనే గ్రామ సచివాలయాల్లో అన్ని సేవలూ అందుతుండగా ఆధార్ సేవలు మాత్రం అందడం లేదు. వీటిని వెంటనే పునరుద్ధరించాలి.

– బర్ల జ్యోతి ,చేబ్రోలు

మోటారు సైకిళ్ల తనిఖీ



పండ్రవాడ రోడ్డులో మోటారు సైకిళ్లను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలలో నిబంధనలను పాటించాలనే ఆదేశాల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీలు చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యుడు కర్రి హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో పండ్రవాడ, పవర గ్రామాల పరిధిలో మోటారు సైకిళ్ల సైతం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహాలకు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లే వారు వెంట నగదు తీసుకొని వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా నగదు, మద్యం వాహనాలలో ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.